www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 13 జులై 2024

5

పశ్చిమ గోదావరి



జిల్లాలో పలు చోట్ల వర్షం



మొగల్తూరు : రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

మొగల్తూరు:మండలంలోని గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ఉదయమే పనులకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారులపై వర్షపు నీరు నిలిచి కాల్వలను తలపించింది.

నరసాపురం:జిల్లాలో శుక్రవారం ఉదయం 8 గంటల వరకూ గడిచిన 24 గంటల్లో గణపవరంలో గణపవరం 35.6 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. పాలకొల్లులో 30.4, ఆకివీడు 29.2, తాడేపల్లిగూడెం 23.2, పెంటపాడు 20.6, పెనుగొండ 19.4, మొగల్తూరులో 19.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటు వర్షపాతం 17.7 మిల్లీమీటర్లు నమోదైంది.

చెప్పింది వింటారా.. ఇంటికెళ్లిపోతారా..!

జిల్లాలో స్కీమ్ వర్కర్లపై వేధింపులు

రోజురోజుకీ పెరుగుతున్న కూటమి నేతల హెచ్చరికలు, ఆపై అధికారులపైనా ఒత్తిళ్లు

కూటమి నేతల తీరుపై అధికారుల అసంతృప్తి

వేధింపులు ఆపకపోతే చూస్తూ ఊరుకోం : సిఐటియు

స్కీమ్ వర్కర్లపై కూటమి నేతల ఒత్తిళ్లు రోజురోజుకీ ఎక్కువైపోతున్నాయి. మేము చెప్పిందే వినాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. వినకపోతే ఉద్యోగం వదిలి వెళ్లిపోవాలని వేధింపులకు గురి చేస్తున్నారు. తమకు అనుకూలంగా లేని వారిని ఉద్యోగాల నుంచి తొలగించి తమ అనుకూలురను ఆయా స్థానాల్లో నియమించాలని అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో స్కీమ్ వర్కర్లతోపాటు అధికారులు కూడా కూటమి నేతల తీరుపై అసంతృప్తి, అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే స్కీమ్ వర్కర్లపై అధికారపక్ష వేధింపులు ఆపకపోతే చూస్తూ ఊరుకోబోమని సిఐటియు హెచ్చరిస్తోంది.

ప్రజాశక్తి - భీమవరం


ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమి జిల్లాలో క్లీన్‌స్వీప్ చేసింది. ఏడు అసెంబ్లీ స్థానాలకుగాను నాలుగు టిడిపి, మూడు జనసేన, ఎంపీ స్థానం బిజెపి కైవసం చేసుకున్నాయి. గత వైసిపి ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పి కూటమి ప్రభుత్వానికి పట్టంగట్టారు. అయితే కూటమి నేతల తీరుపై ప్రజలు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా స్కీమ్ వర్కర్లతోపాటు ప్రభుత్వ ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో డ్వాక్రా యానిమేటర్లు, పట్టణ ప్రాంతాల్లో రిసోర్స్‌పర్సన్లు (ఆర్‌పి) సుమారు వెయ్యి మంది పని చేస్తున్నారు. డ్వాక్రా మహిళల ఆర్థిక అభివృద్ధికి, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో యానిమేటర్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇన్ని రకాల సేవలందిస్తున్న యానిమేటర్ల పట్ల అధికారపక్ష నేతలు ఇష్టానుసారంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీరవాసరం మండలంలో ఒక డ్వాక్రా యానిమేటర్ ఏడాది క్రితం ఇదే డ్వాక్రాలో ఉద్యోగం నిమిత్తం వెళ్లిపోతూ ఆ స్థానంలో తన కుటుంబానికి చెందిన వారిని నియమించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆమెను ఉద్యోగం నుంచి తొలగించారు. దీంతో బాధిత యానిమేటర్ మిగిలిన యానిమేటర్ల ద్వారా సంతకాలు సేకరించి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై టిడిపి నేతలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తూ తమకు అనుకూలంగా పని చేయకపోతే ఇక్కడ ఎవరూ ఉండరని బెదిరింపులకు పాల్పడటం గమనార్హం. జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో జిల్లాలో సుమారు వెయ్యి మంది ఫీల్డ్ అసిస్టెంట్లుగా పని చేస్తున్నారు. పేదలకు పనులు చూపడంలో వీరిదే క్రియాశీలక పాత్ర. రోజువారీ మస్తర్లు పూర్తిస్థాయిలో ఉండకపోవడంతో చాలామంది ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు అందే పరిస్థితి లేదు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్లు కూడా కూలీలతోపాటు ఒక మస్తరు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. దీన్నే అదునుగా చేసుకుని కూటమి నేతలు పాలకోడేరు, కాళ్ల మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లపై బెదిరింపుల పర్వానికి దిగినట్లు సమాచారం. తాము చెప్పిన వాళ్లకు మస్తర్లు వేయాలని హుకుం జారీ చేస్తున్నారు. తాము చెప్పింది వినకపోతే మీ అంతు చూస్తామంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇదిలాఉంటే గత ప్రభుత్వంలో నేతలతో సన్నిహితంగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించాలని అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. వీరవాసరం మండలంలో ఒక గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌ను కొన్ని కారణాలతో తొలగిస్తున్నట్లు తెలియరావడంతో మిగిలిన ఫీల్డ్‌అసిస్టెంట్లు అంతా కలిసి ఎంపిపి దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ కార్మికులు జిల్లాలో 1200 మంది వివిధ విభాగాల్లో పని చేస్తున్నారు. ముఖ్యంగా పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, అటెండర్లుగా పని చేస్తున్న వారిపై కూటమి నేతలు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. తాము ఏం చెబితే అదే వినాలని, ఇష్టం లేకపోతే ఉద్యోగం వదిలి వెళ్లిపోవాలని హెచ్చరిస్తున్నట్లు సమాచారం. దీంతో అంతా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

వేధింపులు ఆపి సమస్యలు పరిష్కరించాలి

ఎం.ఆంజనేయులు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, భీమవరం



స్కీమ్ వర్కర్లకు వేతనాలు లేక ఇబ్బందులు పడుతుంటే వారి పొట్టను కొట్టే ప్రయత్నం కొత్త ప్రభుత్వం చేయడం సరైంది కాదు. గత ప్రభుత్వం నుంచి స్కీమ్ వర్కర్లంతా విధుల్లో ఉన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేయడంలో కీలక భూమిక పోషించారనే విషయం గుర్తుపెట్టుకోవాలి. రకరకాల కారణాలు చూపి ఉద్యోగాల నుంచి తొలగించాలనుకోవడం మూర్ఖత్వం. వేధింపులు ఆపి సమస్యలు పరిష్కరించాలి. లేనిపక్షంలో ఆందోళన చేసేందుకు సైతం వెనకడుగు వేసే ప్రసక్తి లేదు.



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

జిల్లావాసులకు ఇసుక అందుబాటులోకి తేవాలి

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లావాసులకు ఇసుకను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని, దీనికి అవసరమైన అన్ని అనుమతులను వెంటనే పొందాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో గోదావరి నది కన్జర్వేటర్, గనులు శాఖ అధికారులతో ఆమె సమావేశమై జిల్లాలో ఇసుక సరఫరాపై సమీక్షించారు. జిల్లాలో ఇసుక సరఫరా అనేది అత్యధిక ప్రాధాన్యతాంశం అని, దీనిని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ఇసుక సరఫరా అయ్యేవరకు సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనుమతులు పొందడంలో తాత్సారం సరైంది కాదని ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. యలమంచిలి, నరసాపురం గోదావరి పరివాహక ప్రాంతంలోని ఐదు డీసిల్టింగ్ పాయింట్స్‌ను యుద్ధప్రాతిపదికన అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అవసరమైన సిటిఇ, సిటిఒ కాలుష్య నియంత్రణ, పర్యావరణ అనుమతులను పొందటానికి ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలన్నారు. క్వాలిఫైడ్ ఏజెన్సీ నుండి ఎన్విరాన్‌మెంటల్ ప్లాన్, ఫీజిబిలిటీ రిపోర్టు వెంటనే పొందాలని సూచించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఐదు డీసిల్టింగ్ పాయింట్లతోపాటు, మరిన్ని కొత్త డీసిల్టింగ్ పాయింట్లను గుర్తించాలని ఆదేశించారు. గోదావరి రివర్ కన్జర్వేటర్ మైనింగ్ శాఖ సహాయ సంచాలకులతో కలిసి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో గోదావరి రివర్ కన్జర్వేటర్ విశ్వేశ్వరరావు, జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల తుది దశ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లాలో టిడ్కో ఇళ్ల నిర్మాణంలో చివరి దశ పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వశిష్ట కాన్ఫరెన్స్ హాల్‌లో టిడ్కో ఇంజినీర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎల్‌అండ్‌టి నిర్మాణ సంస్థ ప్రతినిధులతో ఆమె సమావేశమై జిల్లాలో చేపట్టిన టిడ్కో నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో 19,872 ఇళ్ల నిర్మాణం చేపట్టగా వాటిలో 8,736 ఇళ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించారని, ఇంకా లబ్ధిదారులకు అప్పగించాల్సిన 11,136 ఇళ్లలో 4,668 ఇళ్ల నిర్మాణం 90 శాతానికిపైగా పూర్తికాగా, 6,368 ఇళ్ల నిర్మాణం 95 శాతానికిపైగా పూర్తయ్యాయని తెలిపారు. వీటిలో ఇళ్ల లోపల చిన్నచిన్న పనులతోపాటు, పెయింటింగ్ పనులు చేపట్టాల్సిందని తెలిపారు. నూరుశాతం పనులను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తేవాలని టిడ్కో, ఎల్‌అండ్‌టి నిర్మాణ సంస్థ ప్రతినిధులను కలెక్టర్ ఆదేశించారు. భీమవరంలో 8,352 ఇళ్లకుగాను 2,944 ఇళ్లు పూర్తి చేసి అప్పగించగా ఇంకా 5,408 అప్పగించాల్సి ఉందన్నారు. తాడేపల్లిగూడెంలో 5,376 ఇళ్లకుగాను 3,232 ఇళ్లు అప్పగించగా ఇంకా 2,144 పూర్తి చేయాల్సి ఉందన్నారు. పాలకొల్లులో 6,144 ఇళ్లకుగాను 2,560 ఇళ్లు అప్పగించామని, ఇంకా 3,584 పూర్తి చేయాల్సి ఉందని అన్నారు. జిల్లాలో ఇప్పటికే అప్పగించిన 8,736 ఇళ్ల సముదాయాల్లో ఏర్పాటు చేసిన డ్రెయినేజీ, రోడ్లు, పారిశుధ్యం, తదితర మౌలిక వసతులను ఎప్పటికప్పుడు సంబంధిత మున్సిపాల్టీలు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. భీమవరంలో ఎస్‌టిపి ప్లాంట్ నిర్మాణ పనులు 90 శాతానికిపైగా పూర్తి కావొచ్చాయని, పూర్తయిన వెంటనే ఇళ్లను లబ్ధిదారులకు అప్పగిస్తామని చెప్పారు. భీమవరం టిడ్కో ఇళ్ల సముదాయానికి అప్రోచ్ రోడ్డు ఏర్పాటుకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. సమావేశంలో టిడ్కో ఇఇ ఎంఎస్.స్వామినాయుడు, మున్సిపల్ కమిషనర్లు ఎం.శ్యామల (భీమవరం), డి.మురళీకృష్ణ (తాడేపల్లిగూడెం), పార్థసారధి (పాలకొల్లు), ఎల్‌అండ్‌టి ప్రతినిధి మణికంఠన్, టిడ్కో ఎఇలు, మున్సిపల్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

యూనిఫారం.. అందేదెప్పుడు..!

స్కూళ్లు తెరిచి నెల రోజులు గడుస్తున్నా అందని యూనిఫారం

రెండు జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 2.35 లక్షల మంది

ఒక్కో విద్యార్థికి మూడు జతలు అందజేయాలని నిబంధన

ప్రభుత్వం వెంటనే ఇవ్వాలంటున్న తల్లిదండ్రులు

117 జిఒ రద్దుపై సర్వత్రా చర్చ



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాలలు తెరిచి నెల రోజులు గడిచిపోయింది. విద్యార్థులకు ఇప్పటి వరకూ యూనిఫారం అందని పరిస్థితి నెలకొంది. దీంతో యూనిఫారం ఎప్పటికిస్తారనే చర్చ తల్లిదండ్రుల్లో సాగుతోంది. ఏలూరు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ స్కూళ్లు 2,087 వరకూ ఉండగా లక్షా 36 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 1,875 ప్రభుత్వ స్కూళు ఉండగా 99 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. నిబంధనల ప్రకారం స్కూళ్లు తెరిచేనాటికి విద్యార్థులకు పుస్తకాలు, బూట్లు వంటి వాటితోపాటు యూనిఫారం సైతం అందించాలి. ప్రతి విద్యార్థికీ ఏడాదికి మూడు జతలు యూనిఫారం అందించాలనే నిబంధనలు సైతం ఉన్నాయి. ఏడాదిపాటు విద్యార్థులు ప్రతిరోజూ యూనిఫారం ధరించడంతో చినిగిపోవడం పరిపాటిగా జరుగుతోంది. స్కూళ్లు తెరిచేనాటికి యూనిఫారం క్లాత్ ఇస్తే వాటిని కుట్టించుకోవడానికి కొంత సమయం పడుతోంది. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. సూళ్లు తెరిచి నెల రోజులు దాటినా యూనిఫారం క్లాత్ ఇవ్వకపోవడంతో విద్యార్థులు గతేడాది ఇచ్చిన యూనిఫారంనే వాడుతున్నారు. దీంతో కొంతమంది చినిగి దెబ్బతిన్న యూనిఫారం వేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పుస్తకాలు, మిగిలిన వస్తువులు విద్యార్థులకు అత్యధిక శాతం ఇచ్చినప్పటికీ యూనిఫారం మాత్రం ఇప్పటి వరకూ విద్యార్థులకు చేరలేదు. విద్యార్థులకు యూనిఫారం ఎప్పటికిస్తారో సరైన స్పష్టత లేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు యూనిఫారం క్లాత్ అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అదేక్రమంలో గత ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు పనులకు సంబంధించి సైతం సందిగ్ధత నెలకొంది. రెండో విడత నాడు-నేడు పనుల్లో వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. దీంతో చాలా పాఠశాలల్లో పనులన్నీ సగం సగం అన్నట్లు తయారయ్యాయి. వెంటనే నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేస్తేనే స్కూళ్లలో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ప్రభుత్వం దీనిపై వెంటనే తగునిర్ణయం తీసుకుని ముందుకు సాగాల్సి ఉంది. యూనిఫారం అందజేతపై ఏలూరు డిఇఒ అబ్రహాంను వివరణ కోరగా ఇంకా అదొక్కటే పెండింగ్ ఉందని, వారం రోజుల్లో యూనిఫారం సైతం అందజేస్తామని తెలిపారు.

117 జిఒ రద్దు చేస్తేనే నాణ్యమైన విద్య

గత ప్రభుత్వం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యావిధానాన్ని రాష్ట్రంలో అమల్లోకి తెచ్చి విద్యావ్యవస్థను పూర్తిగా గాడితప్పేలా చేసింది. మూడు, నాలుగు, ఐదు తరగతులను హైస్కూళ్లలో విలీనం చేసింది. దీంతో ప్రాథమిక విద్య విద్యార్థులకు అందుబాటులో లేకుండాపోయింది. హైస్కూళ్లన్నీ దాదాపు గ్రామానికి దూరంగా ఉన్న పరిస్థితి ఉంది. మూడు, నాలుగు, ఐదు తరగతులు చదివే చిన్న పిల్లలను ప్రతిరోజూ అంతదూరం ఒంటరిగా పంపించేందుకు తల్లిదండ్రులు భయపడే పరిస్థితి నెలకొంది. దీంతో డ్రాప్‌వుట్స్ పెరగడంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. అంతేకాకుండా నూతన విద్యావిధానంలో భాగంగా ప్రభుత్వం తెచ్చిన 117 జిఒతో విద్యావ్యవస్థ అన్ని రకాలుగా దెబ్బతింది. గతంలో 40 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండేవారు. మార్పుల పేరుతో ఒకటి నుంచి ఎనిమిది తరగతుల వరకూ 52 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండేవిధంగా చేశారు. తొమ్మిది, పది తరగతులకు 60 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండేవిధంగా మార్చేశారు. ఇంగ్లీష్, తెలుగుమీడియంకు వేర్వేరు సెక్షన్లు లేకుండా ఒకటే సెక్షన్‌గా మార్పులు చేశారు. టిడిపి కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో 117 జిఒను రద్దు చేస్తామని హామీ ఇచ్చింది. ఈ జిఒ రద్దు చేస్తే ఉపాధ్యాయుల సంఖ్య పెరుగుతోంది. ఒకే ఉపాధ్యాయుడు ఉండే పాఠశాలలు తగ్గుతాయి. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం ఉంటుంది. దీంతో జిఒ రద్దు ఎప్పుడనే చర్చ సర్వత్రా సాగుతోంది. ప్రభుత్వం వెంటనే 117 జిఒను రద్దు చేసి విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలని అంతా కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్‌ఎకు వినతి

ప్రజాశక్తి - తణుకు



ఎంఎల్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తణుకు ఎంఎల్‌ఎ రాధాకృష్ణను కలిసి పట్టణంలో ప్రజలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ తణుకు పట్టణంలో మధ్యతరగతి ప్రజలు, కార్మికులు, సన్న, చిన్నకారు రైతులు, చేతివృత్తిదారులు ఎక్కువగా ఉన్నారన్నారు. పలు గ్రామాల నుండి ఉపాధి కోసం ఈ కాలంలో పట్టణంలోని పరిశ్రమల్లో పని చేసేందుకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. పట్టణం విస్తరించినప్పటికీ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అభివృద్ధి మాత్రం లేదన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా తణుకు పట్టణాభివృద్ధి నేటికి జరగలేదన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే అభివృద్ధి జరుగుతుందని కోరుకున్న ప్రజల నమ్మకాన్ని నిలబెట్టి, సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, గుబ్బల గోపి, గణేష్, విజయ్, వెంకటేశ్వరరావు, బంగారమ్మ, సత్యవతి, శారద తదితరులు పాల్గొన్నారు.

గునుపూడి, తాడేరు మురుగు కాలువను తవ్వాలి

కౌలు రైతు, రైతుసంఘాల ఆధ్వర్యాన రాస్తారోకో

ప్రజాశక్తి - భీమవరం



తాడేరు వంతెన వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు

గునుపూడి, తాడేరు మురుగు కాలువను తక్షణమే తవ్వి, రైతుల నారుమళ్లు, పంట పొలాలను కాపాడాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. మురుగు కాలువలోని గుర్రపుడెక్క, కిక్కిస, తూడును తక్షణమే తొలగించాలని ఎపి కౌలురైతుల సంఘం, రైతుసంఘం ఆధ్వర్యంలో తాడేరు వంతెన వద్ద రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ గునుపూడి మురుగు కాలువను ఏళ్ల తరబడి తవ్వకపోవడంతో పూడిపోయిందన్నారు. గుర్రపుడెక్క, కిక్కిస పెద్దఎత్తున పెరిగిపోవడంతో నీరులాగే పరిస్థితి లేదన్నారు. ఈ కాలువపై దాదాపు పదివేల ఎకరాల్లో మురుగునీరు లాగే పరిస్థితి లేదని తెలిపారు. ప్రస్తుతం కొద్దిపాటి వర్షానికే నీరు ప్రవహించకపోవడంతో వందలాది ఎకరాల్లో నారుమళ్లు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కాలువను ఆధునికీకరించాలని డిమాండ్ చేశారు. రైతులు కర్రి అచ్యుతరావు, మట్టా ఏసు, పూడి పెద్దిరాజు, పలువురు కౌలురైతులు మాట్లాడుతూ సమస్యను పలుమార్లు డ్రెయినేజీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుతం నారుమడుల్లో నీరు లాగక పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. కాలువల్లో చెత్తాచెత్తారం తొలగించేందుకు తక్షణం చర్యలు చేపట్టాలి తప్ప తాత్కాలికంగా రసాయన మందులు పిచికారీ చేయడం ఉపయోగకరం కాదన్నారు. లేనిపక్షంలో క్రాప్ హాలిడే ప్రకటిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వమే కౌలురైతులు, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోతుల అమృతరావు, నల్లం వెంకటేశ్వరరావు, వంగా పుల్లారావు, నల్లం వెంకటేశ్వరరావు, గణేషుల శ్రీనివాస్, పివి.భాస్కరరావు, బొబ్బిలి రాము, రాసపల్లి వెంకటేశ్వరరావు, ముచ్చు రంగారావు, సిహెచ్.బాలాజీ పాల్గొన్నారు.

లంచాలిచ్చి ఉద్యోగాలు పొందినవారిని తొలగిస్తాం

ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



ఎంఎల్‌ఎను సత్కరిస్తున్న సభ్యులు

వైఎస్‌ఆర్ హార్టీ కల్చరల్ యూనివర్శిటీ ఔట్ సోర్సింగ్ విధానంలో 6 నెలల క్రితం లంచాలిచ్చి ఉద్యోగాలు పొందిన సుమారు 25 మందిపై విచారణ జరిపామని, వారిని విధుల నుంచి తొలగిస్తామని ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వెంకట్రామన్నగూడెంలోని యూనివర్శిటీ ప్రధాన కార్యాలయంలో అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ 2019 నుండి 2024 వరకూ గత ప్రభుత్వ అసమర్థత కారణంగా నిధులు లేక అభివృద్ధి కుంటుపడిందన్నారు. యూనివర్శిటీ ఉన్నత అధికారులు గత వైసిపి ప్రభుత్వ నాయకులకు అనుకూలంగా వ్యవహరించి యూనివర్శిటీని భ్రష్టు పట్టించారన్నారు. ఔట్‌సోర్సింగ్ విధానంలో అర్హతలేని కొంతమంది గత ప్రభుత్వ పెద్దలకు లంచాలిచ్చి ఉద్యోగాలు పొందారన్నారు. తక్షణం వారు విధుల నుంచి తప్పుకోవాలని లేనిపక్షంలో వారిపై కేసులు నమోదు చేసి విచారణ జరిపిస్తామని తెలిపారు. అలాగే ఫర్నీచర్ కొనుగోలుకు సుమారు రూ.కోటీ 50 లక్షలు ఖర్చు చేశారని దానిలో అవకతవకలు ఉన్నట్లు సమాచారం ఉందని దీనిపై కూడా విచారణ చేస్తామని తెలిపారు. కొత్త వంగడాలు, నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని శాస్త్రవేత్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు జగన్‌ను శాశ్వతంగా మర్చిపోవాలి : మంత్రి నిమ్మల

కొంతేరులో ఆవ డ్రెయిన్‌లో గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - యలమంచిలి

ఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలో వ్యవసాయాన్ని, రైతు సంక్షేమాన్ని మర్చిపోయిన జగన్‌ను రైతులు కూడా శాశ్వతంగా మర్చిపోవాలని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. కొంతేరులో శుక్రవారం పాలకొల్లు ఆవ డ్రెయిన్‌లో గుర్రపుడెక్క, తూడు తొలగింపునకు సంబంధించి డ్రోన్ ద్వారా రసాయనం చల్లే పనులను ఆయన ప్రారంభించారు. ఆయనే స్వయంగా డ్రోన్‌లో రసాయనం వేసి గాలిలోకి వదిలారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రైతులకు మేలు జరిగేలా మురుగు డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూడు నిర్మూలన పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేశారన్నారు. రాష్ట్రంలో 960 పనులకు రూ.90 కోట్లకు పైగా ఖర్చు పెడుతున్నామని చెప్పారు. జగన్ ఐదేళ్లలో పంట కాలువలు, మురుగు డ్రెయిన్లను నిర్లక్ష్యం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లోనే పంట కాలవలు, మురుగు డ్రెయిన్ల ప్రక్షాళన పనులపై దృష్టి సారించామన్నారు. ఈ కార్యక్రమంలో డ్రెయినేజీ ఇఇ ఎంవివి.కిషోర్, డిఇ వి.వినోద్‌చంద్, ఎఇ పి.ఉదయశంకర్, ఎఎంసి మాజీ ఛైర్మన్ ఉనమట్ల కబర్ధి తదితరులు పాల్గొన్నారు



స్వయంగా రసాయనాన్ని కలిపి డ్రోన్‌లో పోస్తున్న మంత్రి నిమ్మల

ఆసుపత్రిలో మెరుగైన సేవలందించాలి : ఎంఎల్‌ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఏరియా ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు సిబ్బంది కృషి చేయాలని ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. శుక్రవారం ఏరియా ఆసుపత్రిని నాయకర్ పరిశీలించారు. ప్రతి వార్డు తిరుగుతూ వైద్య సిబ్బంది పనితీరుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని వైద్యులు, సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆర్.సుప్రియ అధ్యక్షతన సమావేశం జరిగింది. తొలిసారిగా కంటి శస్త్ర చికిత్స చేసిన వైద్య బందాన్ని నాయకర్ అభినందించారు. పలువురు వైద్యులు పూర్తిస్థాయిలో వైద్య పరికరాలు ఉంటే బాగుంటుందని నాయకర్ దృష్టికి తీసుకొచ్చారు. ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఆసుపత్రిలో సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ప్రస్తుతం వ్యాధుల సీజన్ కావడంతో వైద్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ మేకల సతీష్, ఘంటా కృష్ణ, పోలిశెట్టి నళిని పాల్గొన్నారు.


నాయకర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న అంగన్వాడీ వర్కర్స్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యాన ఎంఎల్‌ఎ నాయకర్‌కు వినతి

ప్రజాశక్తి - నరసాపురం

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మొగల్తూరు ప్రాజెక్టు చెందిన అంగన్వాడీ వర్కర్స్ సిఐటియు ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్స్, మినీ వర్కర్స్ అనేక సేవలందిస్తున్నారు. పనిభారం పెరిగినా, ధరలు పెరిగినా ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగలేదన్నారు. వేతనాల పెంపు, గ్రాట్యూటీ అమలు తదితర సమస్యల కోసం గత ప్రభుత్వం ఆధ్వర్యంలో 42 రోజుల పాటు తీవ్ర నిర్బంధాన్ని ఎస్మాలాంటి చట్టాలను ఎదిరించి సుదీర్ఘ సమ్మె చేశామని గుర్తు చేశారు. అనివార్యంగా ప్రభుత్వం కొన్ని జిఒలు ఇచ్చిన ప్రధాన సమస్యలు పరిష్కరించలేదన్నారు. సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జి.పెద్దింట్లు, ఎ.సీతారత్నం, జి.శ్రీలక్ష్మి, ఎన్.నీలిమ, కె.కామాక్షి పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలి జెడ్‌పిహెచ్ స్కూల్ విద్యార్థులకు రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చేతుల మీదుగా శుక్రవారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారని, అటువంటి విద్యా శాఖను గాడిలో పెట్టి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు మంత్రి నారా లోకేష్ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని తెలిపారు. అనంతరం సుమారు 250 మంది విద్యార్థులకు బ్యాగ్‌లు, యూనిఫారాలు, టెక్స్‌బుక్స్, నోట్ బుక్స్, షూలు పంపిణీ చేశారు.

ఆచంట : ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న నోట్ పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎంవిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ కళాశాలకు టిడిపి నాయకులు గొడవర్తి శ్రీరాములు ఆర్ఒ వాటర్ ప్లాంట్‌ను ఉచితంగా అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు అభినందనలు తెలిపారు. కాలేజీ అభివృద్ధికి స్థానిక నాయకులు కృషి చేయాలని కళాశాల లైబ్రరీ సైన్స్ అధ్యాపకులు కె.హరి రామలింగేశ్వరరావు అన్నారు.

బాలలు, మహిళా చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - కాళ్ల

మహిళలు, బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఆకివీడు ఐసిడిఎస్ సెక్టార్, కాళ్ల సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి తెలిపారు. కాళ్లలో మహిళలు, బాలల హక్కులపై అవగాహనా ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఉమెన్స్, ఛైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పౌష్టికాహారం అందించడంతోపాటు, మొదట కాన్పులో రూ.5 వేలు, రెండో కాన్పులో ఆడబిడ్డకు జన్మనిస్తే రూ.7 వేలు అందిస్తుందన్నారు. పిఎం మాతృత్వ వందన యోజన ప్రయోజనాలు, లింగ నిర్ధారణ పరీక్ష చట్టంపై అవగాహన కల్పించారు. బాలల హక్కుల, పోక్సో చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్, డాక్టర్ సునీత, సిహెచ్ఒ డి.విజయవతి, పిహెచ్ఎన్ ఛండీరాణి, పాల్గొన్నారు.

పాడి రైతుల కుటుంబాలకు సాయం

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని కాజ పడమరలో గత కొద్ది రోజుల కిందట గుర్తుతెలీని వ్యక్తులు పాకలు, గడ్డివాములకు నిప్పు పెట్టిన ఘటనలో ముగ్గురు రైతు కుటుంబాలకు చెందిన పశువులు 90 శాతం కాలిపోయాయి. అయితే ఆయా రైతు కుటుంబాలకు టిడిపి ఆధ్వర్యంలో సేకరించిన రూ.65 వేలు సహాయాన్ని మంత్రి నిమ్మల అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ రాజకీయాలు అంటే ప్రజలకు సేవ చేయడమేనని తెలిపారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో టిడిపి ముందుంటుందని తెలిపారు. గత నెలలో పాకలు, గడ్డివాములు అగ్నికి ఆహుతవ్వగా, పశువులు 90 శాతం కాలిపోయాయని, దీంతో మూడు కుటుంబాలకు తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. అయితే పార్టీ కుటుంబ సభ్యులంతా కలిసి రూ.రెండు, రూ.మూడు వేలు చొప్పున వేసుకుని బాధిత కుటుంబాలకు అందజేసినట్లు తెలిపారు. ఈ నష్టానికి ఇన్స్యూరెన్స్ వర్తించని కారణంగా టిడిపి వారంతా ఈ మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. గంజాయి బ్యాచ్‌పై ఉక్కు పాదం మోపాలని నీటి పారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. గంజాయి బ్యాచ్ ఆగడాలను అడ్డుకట్ట వేయాలన్నారు.

రామన్నపాలెం ఆరోగ్య కేంద్రానికి ప్రత్యేక గుర్తింపు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు పిహెచ్‌సి పరిధిలోని రామన్నపాలెం-01 ఆరోగ్య ఆయుష్మాన్ మందిర్ (హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్)కు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖకు సంబంధించిన నేషనల్ క్వాలిటీ అసూయరెన్స్ స్టాండర్డ్స్ నాణ్యత ప్రమాణాల బృందం జరిపిన పరీక్షల్లో 89.74 శాతంతో జాతీయ నాణ్యత హామీ ప్రమాణ పత్రం పొందిందని పిహెచ్‌సి వైద్యులు ఒ.దినేష్ కుమార్ తెలిపారు. సేవలు, సదుపాయాలు, రోగి హక్కులు, ఇన్పుట్స్, మద్దతు సేవలు, క్లినికల్ కేర్, ఇన్ఫెక్షన్ నియంత్రణ, నాణ్యత నిర్వహణ ఎనిమిది రకాలకు సంబంధించి పరీక్షలు నిర్వహించారన్నారు. దీనిలో రామన్నపాలెం-1 హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ ఎంపికైందని తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు కె.లక్ష్మీపార్వతి, కె.సుధాకర్, సిబ్బందిని రామన్నపాలెం సర్పంచి బందెల ఎలీషా, మాజీ సర్పంచి మేకల పరశు రామ్, గ్రామస్తులు అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఆకివీడు :వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నివారణకు వైద్య ఆరోగ్య శాఖ చేపట్టిన ముందస్తు ప్రచార కార్యక్రమం మండలంలో విస్తృతంగా సాగుతోంది. ఈ కార్యక్రమంలో ఇప్పటికే మండలంలోని ఎనిమిది గ్రామాల్లో ప్రచారం పూర్తి కాగా శుక్రవారం మందపాడు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. డెంగీ నివారణ మసోత్సవం అతిసార వ్యాధి ముందస్తు నివారణ చర్యలు గురించి వైద్యాధికారి డాక్టర్ రమేష్ వివరించారు. దోమల నివారణకు మలాథియాన్ స్ప్రే చేయడం, కాచిన నీరు తాగడం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మందపాడు సర్పంచి, సభ్యులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డెక్కన్ క్రానికల్ కార్యాలయంపై దాడి హేయం

ఆచంట:విశాఖపట్నం డెక్కన్ క్రానికల్ కార్యాలయంలోకి ప్రవేశించి ఆస్తులు ధ్వంసానికి కారకులైన వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఎపి డబ్ల్యూజెఎఫ్ జిల్లా కన్వీనర్ గుండా రామకృష్ణ అన్నారు. శుక్రవారం మార్టేరు శ్రీలక్ష్మి వరాహ నరసింహస్వామి కళ్యాణ మండపంలో ఎపిడబ్ల్యూజెఎఫ్ నియోజకవర్గ సమావేశం గుండా రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ డెక్కన్ క్రానికల్ కార్యాలయంపై దాడి హేయమైన చర్య అన్నారు. దీనికి కారకులైన వ్యక్తులను తక్షణం అరెస్టు చేసి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నేడు విలేకరులు ఆర్థికంగా, వృత్తిపరంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమాజ సేవ కోసం నిరంతరం పోరాడుతున్నా ప్రభుత్వ పరంగా తమకు ఎటువంటి చేయూతా లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి విలేకరికీ అక్రిడేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, హెల్త్ ఇన్సూరెన్స్, మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షులు విజయ రాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ విలేకరులు వి.విజయ్‌కుమార్, పి.మోహన్‌రావు, జి.రాజశేఖర్, ఎన్.సుబ్బరాజు, కె.వెంకటేశ్వర్లు, టి.శేఖర్, వి.జయరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనలేం.. తినలేం..!

మండుతున్న కూరగాయల ధరలు
జనం బెంబేలు

ప్రజాశక్తి - ఆకివీడు

కూరగాయల ధరలు సామాన్యుడికి అందుబాటులో లేని పరిస్థితి ఏర్పడింది. కనిష్టంగా 50 రూపాయలు, గరిష్టంగా 120 రూపాయలు ఉన్నాయి. ఆకాశాన్నంటిన ధరలు చూస్తే సామాన్య ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కూరలు కొనాలంటేనే భయపడిపోతున్నారు. సగటు మనిషికి కూరలు కనీసం అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. వంకాయలు కేజీ రూ.80 నుంచి రూ.90 వరకూ విక్రయిస్తున్నారు. అన్ని కూరల్లో కచ్చితంగా వాడే కూర టమాటా. మొన్నటి వరకూ కేజీ 20 రూపాయలు ఉండే టమాటా ధర ప్రస్తుతం రూ.60లు పలుకుతోంది. చివరికి పచ్చిమిర్చి


కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారి

సైతం నషాలానికి అంటుతోంది. కేజీ రూ.100 వరకూ పలుకుతోంది. ఇక చిక్కుడుకాయ, బీట్రూట్, క్యాప్సికం వంటి కూరలు ఎప్పుడో వంద దాటిపోయాయి. సీజనల్ కూడా సాధారణ సైజులో ఉండే ఆనపకాయ 40 రూపాయల వరకూ విక్రయిస్తున్నారు. దీంతో సామాన్య ప్రజానీకం కూరగాయలు కొనడానికి భయపడిపోతున్నారు. ఇక కూరగాయలు కొనలేం.. తినలేం అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది వరకూ రూ.200 తీసుకెళ్తే సంచి నిండా కూరగాయలు వచ్చేవని ప్రస్తుతం అవే డబ్బులకు రెండు, మూడు రకాల కూరగాయలు మాత్రమే వస్తున్నాయని వాపోతున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన కూరగాయలు

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిన నాణ్యమైన కూరగాయలు, ఆకుకూరలు తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ప్రాజెక్ట్ మండల ఇన్‌ఛార్జి పి.దేవీనాగరాజు అన్నారు. అండలూరు గ్రామంలో సూర్య మండలంపై అవగాహనా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్య మండలంలో ఏడాది పొడవునా కూరగాయలు, ఆకు కూరలు లభిస్తాయన్నారు. ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా ఘన జీవామృతం, జీవామృతం, కషాయాలు గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ప్రతి ఒక్కరూ కూరగాయలు పండించి తినాలని, ఇంటిపైన ఖాళీ స్థలంలో టెర్రస్ గార్డెన్స్, కిచెన్ గార్డెన్స్ ప్రతి ఒక్కరూ పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పిలు నవీన్‌కుమార్, సర్వేశ్వరరావు, నాగరాజు, శ్రీనివాస్, మురళీకుమారి, సతీష్ కుమారి, రైతులు పాల్గొన్నారు.

డిసిసిబి ఛైర్మన్ పదవి తాతాజీకి కేటాయించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ పదవిని సహకార రంగంలో అపార అనుభవం ఉన్న కలవకొలను తాతాజీకి కేటాయించాలని రామన్నపాలెం, మొగల్తూరు గ్రామాల రైతులు కోరారు. శుక్రవారం పులపర్తివారితోట దుర్గమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీతారామపురం సొసైటీ సభ్యులు, రైతు సంఘాల నాయకులు గుబ్బల చలపతిరావు (బుజ్జి), యాళ్ల అబ్బులు, నీటి సంఘం మాజీ డైరెక్టర్ అయితం చందు, ఉప సర్పంచి మేకల ఆజా, కోట్ల బాపన్న, పులవర్తి రాంబాబు, ఆకన ఏడుకొండలు, కుక్కల మోహనరావు, ఇంటి గోపాలరావు, వీరవెంకట సత్యనారాయణ, గ్రంధి ప్రసాద్ మాట్లాడారు. గత ప్రభుత్వంలో సహకార సంఘాలకు ఎన్నికలు లేకుండా నిర్వీర్యం చేశారని, వాటికి పూర్వ వైభవం తీసుకురావాలంటే సీతారామపుం సొసైటీకి సుదీర్ఘకాలం అధ్యక్షుడుగా పని చేసిన తాతాజీకి డిసిసిబి ఛైర్మన్ పదవి ఇవ్వాలన్నారు.


శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించిన సభ్యులు

కంప్యూటర్‌పై అవగాహనుండాలి

ప్రజాశక్తి - కాళ్ల

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు తమ పాఠశాల విద్యార్థుల ఉన్నతికి అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని కోపల్లె హైస్కూల్ ప్రధానో పాధ్యాయురాలు నిర్మలాదేవి అన్నారు. కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో డిజిటల్ ఫౌండేషన్ పేరిట ఎక్స్‌ప్లోరింగ్ కంప్యూటర్ బ్రెయిన్ అండ్ ఎంఎస్ ఆఫీస్ పేరిట 3 రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించారు. కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.భువనేశ్వర్ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోఆర్డినేటర్ భువనేశ్వరి మాట్లాడుతూ టెక్నాలజీ పరంగా నేటి ఆధునిక ప్రపంచం పరుగులు తీస్తోందని, ఈ మేరకు విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పించాలని తెలిపారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి కంప్యూటర్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం కంప్యూటర్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్ణచంద్ర, అంజన, హర్షిత, శ్రీవల్లి పాల్గొన్నారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పిఎం పోషన్ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించారు. మెనూ ప్రకారం వండుతున్నారా లేదా అని ఆరా తీసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. గుడ్లు, చిక్కీ, జావ తప్పకుండా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పరిశుభ్రమైన నీటితో వంటలు చేయాలని, తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో భోజనం చేసే పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. భోజనం ముందు భోజనం తర్వాత చేతులు కడుక్కోవాలన్నారు. ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు ఆదేశాల మేరకు పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.మహేష్ బాబు వివరించారు. ఈ ఏడాది పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత ఉండాలని, దాంతోపాటు సబ్జెక్టు బాగా నేర్చుకోవాలని తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా మధ్యాహ్న భోజన కోఆర్డినేటర్స్ కె.కస్తూరావు, జి.చిన్నయ్య, భీమవరం ఉప విద్యాశాఖాధికారి నక్కా శ్రీనివాస్, ఎంఇఒ-2 వేంద్ర వెంకటేశ్వరరావు, ఎంఇఒ పివిఎస్.నాగరాజు ఉన్నారు.

పాలకోడేరు : వైద్య సేవలందించడంలో మరింత చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం పాలకోడేరు పిహెచ్‌సిని కలెక్టరు ఆకస్మికంగా తనిఖీ చేసి, పలు వైద్య విభాగాలను పరిశీలించారు. తొలుత సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి, ఎంతమంది విధుల్లో ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. ఒపి వార్డులను, ప్రసూతి వార్డులను పరిశీలించి, రికార్డులను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా పేదలు ఎంతో నమ్మకంతో వైద్య సేవలకు వస్తారని, వారికి సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖా అధికారి మహేశ్వరరావు, మెడికల్ అధికారి, ఎఎన్ఎంలు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ఉచిత ఇసుక విధానం సామాన్యులకు వరం'

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం వల్ల సామాన్య ప్రజలకు ఊరట లభించినట్లయ్యిందని టిడిపి మండల అధ్యక్షులు తమనంపూడి శ్రీనివాసరెడ్డి (బుల్లా) అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని చంద్రబాబు అధికారంలోకి వచ్చి నెల రోజుల్లోపే అమలు చేశారన్నారు. ఉచిత ఇసుక విధానం అమలు చేస్తూ జిఒ 43 విడుదల చేయడం రాష్ట్ర ప్రగతికి బాటలు వేసిందన్నారు. జిల్లాల స్థాయిలో శాండ్ కమిటీలు ఏర్పాటు చేసి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్‌డిఒలు, మైనింగ్ అధికారులు పర్యవేక్షిస్తారని, వినియోగదారులు లబ్ధిపొందాలని ఆయన అన్నారు.

అంతర్జాతీయ స్థాయి విజేతలుగా నిలవాలి

తణుకు:క్రీడాకారులు కఠోర సాధన చేసి జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో విజేతలుగా నిలిచి, జిల్లాకు మంచి పేరు తేవాలని ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాలలోని చిట్టూరి సుబ్బారావు, సత్యఉషారాణి ఇండోర్ స్టేడియం వద్ద జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యఉషారాణి మాట్లాడుతూ తణుకు నుంచి జాతీయ స్థాయిలో విజేతలైన క్రీడాకారులు హేమంత్‌శ్రీ, మనోజ్ఞను అభినందించారు. జిల్లా సెక్రటరీ మెంటే వంశీకృష్ణ మాట్లాడుతూ ఇక్కడ విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతారన్నారు. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్ సతీష్‌బాబు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌కు జిల్లా నలుమూలల నుండి 200 మంది క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఎపి బ్యాడ్మింటన్ అసోసియేషన్ మెంబర్ కెఎస్ఆర్‌వి ప్రసాద్, వివేకానంద గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ చిట్టూరి రీనాసాయి పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ఉండి

చెరుకువాడ శివారు వడ్డిగూడెంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 1800 రూపాయల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మందపల్లి లక్ష్మణ్ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నరసాపురం

లారీ ఢీకొని వ్యక్తి ఘటనా స్థలంలోని మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నరసాపురానికి చెందిన తాతమూడి వీర వెంకట సూర్యనారాయణ మూర్తి (62) వ్యవసాయం చేస్తుంటాడు. శుక్రవారం నరసాపురం నుండి భీమవరం బ్యాంక్‌కు బైక్‌పై వెళ్తుండగా కొప్పరు గ్రామంలో లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో మృతి చెందాడు. మృతుడి భార్య సుబ్బలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ కె.గురయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

16న మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల 16వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పి.పద్మజ తెలిపారు. ఎంపిపి కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసు) అధ్యక్షతన జరనున్న సమావేశంలో 21 శాఖలకు చెందిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరుగుతుందని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కండి

ప్రజాశక్తి - ఉండి

లయన్స్ క్లబ్ సభ్యులు పర్యావరణ పట్ల శ్రద్ధ తీసుకుని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఇంటర్నేషనల్ డైరెక్టర్ పి.సుభాష్‌బాబు కోరారు. గురువారం రాత్రి ఉండిలో కూనపరాజు అప్పలరాజు సీతమ్మ లయిన్స్ ఆడిటోరియంలో క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. సభకు వేగేశ్న అనంత లక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుభాష్ బాబు మాట్లాడారు. కార్యక్రమంలో రుద్రరాజు నరసరాజు, గాదిరాజు రంగరాజు, కన్నెగంటి రూత్ కళ, సాగిరాజు సూర్య కుమారి పాల్గొన్నారు.

హాస్టల్లో జడ్జి తనిఖీ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మండల న్యాయ సేవాధికారా సంస్థ ఆధ్వర్యంలో 1వ అదనపు సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ కె.శ్రీనివాస్ ఎన్‌టిఆర్ కాలనీలోని ఎస్‌సి సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. బాలికలతో నేరుగా మాట్లాడి హాస్టల్‌లో సౌకర్యాల గురించి ఆరా తీశారు. అనంతరం బాత్రూంలను పరిశీలించి అక్కడ వాడిన నీరు బయటకు వెళ్లేందుకు డ్రెయినేజీ లేకపోవడం గమనించి, అధికారికి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వంటశాలను తనిఖీ చేసి విద్యార్థులకు రుచికరమైన ఆహారం పెట్టాలని సూచించారు. ఆయన వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షులు చల్లా దానయ్య నాయుడు, న్యాయవాది వై.దేవేంద్ర ఫణికర్, ఉచిత న్యాయ సలహాదారులు కె.చిట్టి పద్మజ, ఎన్.ఆనంద్ బాబు పాల్గొన్నారు.

ఒక రోజు ఆలస్యంగా పాపులేషన్ డే

వీరవాసరం పిహెచ్‌సి అధికారుల తీరుపై విమర్శలు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒక రోజు ఆలస్యంగా వరల్డ్ పాపులేషన్ డేను నిర్వహించడంపై పిహెచ్‌సి అధికారుల పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 1987 నాటికి ప్రపంచ జనాబా ఐదు బిలియన్లకు చేరుకోవడంతో ఐక్యరాజ్య సమితి సూచనల మేరకు ఏటా జులై 11న వరల్డ్ పాపులేషన్ డేను నిర్వహించాలని సూచించింది. ఈ విధంగా ఈ నెల 11న నిర్వహించాల్సిన పాపులేషన్ డేను ఆ రోజు కాకుండా మరుసటి రోజు శుక్రవారం నిర్వహించడం పట్ల పిహెచ్‌సి అధికారుల తీరు విస్మయాన్ని కలుగజేస్తోంది. పిహెచ్‌సి అధికారులు, సిబ్బంది తీరు గతం నుండి నేటి వరకూ పలు విమర్శలు తావిచ్చే విధంగా ఉంటుందనే విషయం గతంలో జరిగిన సంఘటనలే ఉదాహరణగా ఉన్నాయి. ఇక్కడ ఉన్నతాధికారుల ఆదేశాలు కూడా లెక్కజేయరన్న విమర్శలున్నాయి. ప్రపంచ జనాభా నియంత్రించడంలో ఆ దిశగా ప్రజలను చైతన్యం చేయడంలో ఇటువంటి దినోత్సవాలను జరపాల్సిన అవశ్యకత ఉంది. కానీ వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులకు ఇవేమీ పట్టడం లేదు. తాము ఎప్పుడు జరిపితే అప్పుడే దినోత్సవాలు అన్న చందంగా వారి తీరు ఉంది.

వైద్యులకు అవార్డులు



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ అరుణ

ప్రజాశక్తి - తణుకు

తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణకు బెస్ట్ సర్జన్ (పిపిఐయుసిడి, లూప్) అవార్డు, తణుకు పిపి యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దుర్గామహేశ్వరరావుకు బెస్ట్ ఫ్యామిలీ ప్లానింగ్ సర్జన్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా వరల్డ్ పాపులేషన్ డే సందర్భంగా భీమవరం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ సి.నాగరాణి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. తల్లీ, బిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డకూ, బిడ్డకూ మధ్య అంతరం ఉండేలా కుటుంబ నియంత్రణలో ఉత్తమంగా వ్యవహరించినందుకు గాను డాక్టర్ అరుణకు నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు. కొత్త జిల్లాగా ఏర్పడిన తరువాత డాక్టర్ దుర్గామహేశ్వరరావు అవార్డు పొందడం ఇది మూడోసారి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అవార్డులు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ వారికి అభినందనలు తెలిపారు. తణుకు జిల్లా ఆసుపత్రి సిబ్బంది, పిపి యూనిట్ సిబ్బంది అభినందించారు.



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న దుర్గా మహేశ్వరరావు

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు రుసుం చెల్లించాలి

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో కుల, రాబడి ధ్రువపత్రాలకు సంబంధించి ఒక్కో దానికి రూ.50 చొప్పున రుసుం చెల్లించి సర్టిఫికెట్ తీసుకోవాలని ఎంపిడిఒ ఎస్.శ్రీనివాస్ దొర తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

బొకేలకు బదులు.. నిత్యావసరాలు అందజేత

పేదలకు పంపిణీ చేయాలని కోరిన సర్పంచులు, ఎంపిటిసిలు

ప్రజాశక్తి - నరసాపురం

ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్‌కు శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు నిత్యావసర సరుకులు అందజేశారు. పూల బొకేలకు బదులుగా బియ్యం, కందిపప్పు, గోధుమపిండి, ఇడ్లీ రవ్వ వంటివి అందజేసి పేదలకు పంపిణీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా నాయకర్ వారిని అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కాళీపట్నంలో విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతు నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సురేష్‌కుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో పరిధిలోని కాళీపట్నం, పాతపాడు, జగన్నాధనాపురం, కోమటితిప్ప, కొత్తోట, ముత్యాలపల్లి, వారతిప్ప, మోడీ, కొత్తకాయల తిప్ప, నీటితిప్ప, దారితిప్ప గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

యలమంచిలి : మండలంలోని ఇలకుర్రు సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు యలమంచిలి ఎలక్ట్రికల్ ఎఇ డి.రాజీవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇలకుర్రు సబ్‌స్టేషన్ పరిధిలోని దొడ్డిపట్ల, బూరుగుపల్లి, అబ్బిరాజుపాలెం, ఇలకుర్రు, గంగడపాలెం, కట్టుపాలెం, మట్లపాలెం, నారినమెరక తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్న నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పెనుమంట్ర : ఈ నెల13న పెనుమంట్ర 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నరసాపురం డివిజన్ విద్యుత్ ఇఇ బి.సురేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పెనుమంట్ర, పోలమూరు, మాముడూరు, బ్రాహ్మణచెరువు, జూత్తిగ, నత్తారామేశ్వరం, మల్లిపూడి, సోమరాజు ఇల్లిందాలపర్రు, పెనుమంట్ర గరువు, పెనుమంట్ర గ్రామాలకు ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకూ సబ్ స్టేషన్ మెయింటనెన్స్ కోసం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆసుపత్రిలో తొలి కంటి ఆపరేషన్

నరసాపురం:నరసాపురం ఏరియా ఆసుపత్రిలో తొలిసారిగా కంటి శస్త్ర చికిత్స శుక్రవారం జరిగింది. రుస్తుంబాద గ్రామానికి చెందిన యడ్లపల్లి పుష్పారావు కొన్నేళ్లుగా కంటి చూపు మందగించి ఇబ్బంది పడుతున్నాడు. కంటి వైద్యురాలు ఎస్.చందన ప్రియాంక, స్టాఫ్ నర్స్ చిట్టితల్లి బృందం నేతృత్వంలో ఆపరేషన్ చేశారు. వారిని ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ అభినందించారు.